www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 జులై 2024





## ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబా విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నితిన్ గడ్కరీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని సత్సంగ్ ఫౌండేషన్ ఆవరణలో బుధవారం సాయంత్రం ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబా విగ్రహాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఫౌండర్ పద్మశ్రీ అవార్డు గ్రహీత ముంతాజ్అలీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి ప్రసాద్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జెసి ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు, బిజెపి నేతలు తిరుపతి భానుప్రకాష్, చల్లపల్లి నరసింహారెడ్డి, సాయిలోకేష్ పాల్గొన్నారు. అంతకు ముందు మధ్యాహ్నం మదనపల్లెకు హెలిప్యాడ్ ద్వారా చిప్పిలికి చేరుకున్న మంత్రి గడ్కరికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. మంత్రి మండిపల్లి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కేంద్ర మంత్రిని కలిసి అన్నమయ్య జిల్లా రహదారి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసి జిల్లా అభివృద్ధి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఇ-క్రాప్ నమోదు ఎప్పుడో..?



పంటలు సాగుకు పొలం దున్నుతున్న రైతులు

- ఇ-పంటపై రైతుల్లో అయోమయం
- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- నష్టపరిహారంపై రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-రాయచోటి

ఏరువాక జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సాగుకు మొగ్గు చూపారు. అదును చూసుకుని విత్తనాలు కూడా కొంత మంది రైతులు విత్తుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. ఏడాది ఖరీఫ్ సీజన్లో 1.07 లక్షల ఎకరాల్లో వేరుసెనగ సాగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు లెక్కలు చెబుతున్నారు. వరి పంట కూడా 25 వేలు ఎకరాలు సాగుకు అవకాశం ఉందంటున్నారు. ఈ పంటలతో కాక రైతులు కంది పంటను సాగు చేస్తారు. ప్రధాన పంటలుగా వేరుసెనగ వరి, కంది పంటలు అధికంగా సాగు చేస్తారు. ఉలవ, అలసంద, అనుములు, సజ్జలు, మొక్కజొన్న వంటివి పంటలు సాగు చేస్తారు. ఉద్యానవన పంటలను కూడా అధికంగా జిల్లాలో రైతులు సాగు చేస్తారు. ప్రతి ఏడాది పంటలు సాగు సమయంలో పొలాలకు వచ్చే వ్యవసాయ సిబ్బంది ఈసారి కనిపించక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం ప్రతి ఏడాది పంట సాగు ప్రారంభ దశలో ఇ-క్రాప్ నమోదు చేయించింది. ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇ-క్రాప్ తప్పనిసరి చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇ-క్రాప్‌పై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బందిని ఆరా తీస్తున్నప్పటికీ వారి వద్ద కూడా సరైన సమాధానం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పంట సాగుకు ఎరువులు, పంటను విక్రయించుకోవాలన్నా, పంట నష్టం జరిగినప్పుడు పంటల బీమా పొందాలన్నా, ఇ-క్రాప్ ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఇ-క్రాప్ నమోదుకు ఎదురుచూపులు**

జిల్లాలో పంటలు సాగు చేసే రైతులు రైతన్నలు ఇ-క్రాప్ కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఇ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసింది. ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వెంటనే ఇ-క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభిస్తూ ఉండేది. గ్రామ వ్యవసాయ సహాయకులతో ఈ ప్రక్రియను నిర్వహించేవారు. పంటలు సాగు చేసిన రైతుల పోలం వద్ద నిలబెట్టి పంటతో పాటు ఫొటో తీసి యాప్ వివరాలు, ఇ-క్రాప్ నమోదు, చేసేవారు. రైతులు పండించిన పంటను ఇ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు కూడా చేసేది. ఇ-పంట నమోదుతో పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పంటల నష్టపరిహారానికి ఇ-క్రాప్ ఉపయోగపడుతుంది. జులై మాసం పూర్తికావస్తున్నప్పటికీ ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి ఇ-క్రాప్ నమోదుపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

**ఇ-క్రాప్ నమోదును ప్రారంభించాలి**



వేరుశనగ, కంది, వరి పంటలను సాగు చేశాం. వర్షాలు కూడా సక్రమంగా కురవడం లేదు. జులై ముగుస్తున్నా ఇంతవరకు ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించలేదు. వర్షాలు కూడా అంతంత మాత్రమే కురుస్తున్నాయి. పంటలకు నష్టపరిహారం వస్తుందో రాదో అని ఆందోళనగా ఉంది. వ్యవసాయ అధికారులు అడిగితే తమకు ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఇ-క్రాప్ నమోదు ప్రక్రియపై స్పష్టత రాలేదంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇ-క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించాలి.

-సుబ్బారెడ్డి రైతు, యండపల్లి, రాయచోటి.

**రైతులను ఆదుకోవాలి**



గత సంవత్సరం ఖరీఫ్ పంటలకు ఇ-క్రాప్ చేసింది. ఈ సంవత్సరం ఇ-క్రాప్ నమోదు ఇంత వరకు చేయలేదు. కొత్త ప్రభుత్వం తక్షణమే ఇ-క్రాప్ చేయించాలి. గతంలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించాలి. విత్తనాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలి. జిల్లాలో కొన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటించాలి. ప్రభుత్వాన్ని గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో వర్షం పరిస్థితుల వల్ల కరువు పరిస్థితుల వల్ల ఏర్పడి పంటల దెబ్బతిన రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. కరువుతో నష్టం నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. సాగు చేసిన పంటలకు వెంటనే ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

-ఎస్.రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య జిల్లా.

**ఆందోళన అవసరం లేదు**



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేస్తున్న రైతులు ఇ-క్రాప్ నమోదుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆగస్టు మొదటి వారం లోపల ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.

- బి.చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి.

# వైసిపి ప్రభుత్వంలో 1.70 లక్షల ఎకరాలు దోపిడీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

- సహకరించిన అధికారులు, నాయకులపై చర్యలు
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు
- వంద శాతం హామీలను అమలు చేస్తాం
- విలేకరుల సమావేశంలో మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నాయకులు రూ.36 వేల కోట్లు విలువ చేసే 1.70 లక్షల ఎకరాల భూమి దోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలలో పుంగనూరు, తంబళ్లపల్లె టిడిపి ఇన్‌ఛార్జులు చల్లాబాబు, జయచంద్రారెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చిత్తూరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాలలో పెద్దిరెడ్డి కుటుంబం పెద్ద ఎత్తున భూదోపిడీ చేసిందన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడంతో పాటు వంశపారంపర్యంగా వస్తున్న కొందరి ప్రయివేటు వ్యక్తుల భూములను సైతం బెదిరించి వారివద్ద నుంచి దౌర్జన్యంగా లాక్కొని వేల ఎకరాలు పోగేసుకున్నారని ఆరోపించారు. వీటన్నిటిపైన సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రయివేట్ వ్యక్తులు ఎవరైనా భూములను కోల్పోయుంటే ఫిర్యాదు చేస్తే వారి భూములు వారికి ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తుందన్నారు. పెంచిన పెన్షన్లను ఒకటో తేదీ నాడే ప్రతి ఒక్కరికి ఇంటికెళ్లి అందించడంతో చరిత్ర సృష్టించామన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో చేయలేని పనిని మా ప్రభుత్వం కేవలం 30 రోజుల్లో చేసి చూపించిందని స్పష్టం చేశారు. ఇక సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కదాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని, దాని తర్వాత మహిళలకు ఉచిత సిలిండర్లు, ఆ తర్వాత ఉచిత బస్సు ప్రయాణం ఒకదాని తర్వాత ఒకటి ఖచ్చితంగా అమలు చేసి చూపిస్తామని తెలిపారు. పోలవరం పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరందించేందుకు మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడోరోజు చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టును సందర్శించారని గుర్తు చేశారు. మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాలలో సుమారు మూడు వేల ఎకరాలు భూమి అన్యాకాంతమైనట్లు విలేకరులు మంత్రి దృష్టికి రావడంతో మూడు వేల ఎకరాలు కంటే ఇంకా ఎక్కువ భూమి అన్యాక్రాంతమైందని, వీటన్నిటిని రెవెన్యూ సిబ్బంది ద్వారా సర్వే చేయించి తిరిగి రాబడతామని స్పష్టం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి ఫ్యామిలీ ఇరిగేషన్ ప్రాజెక్టులలో రూ.వంద టెండర్‌ను రూ.3 వేలకు వేసి ఇతర కంపెలను రానియ్యకుండా రూ.వేలకోట్ల ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారని ఆరోపించారు. వీటన్నిటిని పరిశీలించి దోచుకున్న సొమ్మును తిరిగి రాబడతామన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ప్రభుత్వం స్పష్టంగా ఉందని ఎవరిపైన కక్ష పూరిత కేసులు లేవన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రోజుకు 6, 7 అక్రమ కేసులు నమోదయ్యేవని ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. టిడిపి కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను పరిశీలించి ఎత్తివేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ప్రజలందరూ చంద్రబాబు పాలనలో చాలా సంతోషంగా ఉన్నారని రానున్న రోజులు మరిన్ని మంచి కార్యక్రమాలను చేపడుతామని మంత్రి తెలియజేశారు.

# మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి : సిపిఎం





నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రధాన తపాల కార్యాలయం ఎదుట మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై పెద్ద ఎత్తున దాడులు అనేక రూపాల్లో జరుగుతున్నప్పటికీ అత్యాచారాలు అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల ప్రాంతంలో చిన్న పిల్లలపై అత్యాచారం చేసి రిజర్వాయువులో పడేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. ప్రతిరోజు రాష్ట్రంలోనూ, దేశంలోనూ ప్రతి గంటకు మహిళలపై అత్యాచార, లైంగిక వేధింపులు జరుగుతున్నా మహిళలకు ఉన్న చట్టాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫ్లమైందన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కావాలంటే బిజెపి ప్రభుత్వం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి మహిళల హక్కులను పరిరక్షించాలని అన్నారు. మహిళా చట్టాలు అమలు కావాలంటే పోరాటం తప్పదని మహిళా లోకానికి పిలుపునిచ్చారు. మహిళలందరూ హక్కుల కోసం పోరాటానికి భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ పెంచలయ్య, నారాయణ, జంగయ్య పాల్గొన్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

**- బాధ్యతలు స్వీకరణలో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు**



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎర్రచందనం అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా నూతన ఎస్‌పిగా తన కార్యాలయంలో సతీ సమేతంగా పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో చిత్తూరు జిల్లాలో తిరుపతి అర్బన్ పరిధిలో సెబ్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. జీవనోపాధి కోసం వలసలకు వెళ్లి ఇబ్బందుల పడే వారికి పోలీసు నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. చిన్న చిన్న తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్ట్ తనిఖీలతో పాటు కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియా కూడా సమాజంలో ప్రత్యేకమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు కుటుంబ సమేతంగా శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.రమణారెడ్డి, ఆలయ సంప్రదాయం ప్రకారం వీరికి విశేష పూజలు నిర్వహించినారు. దేవస్థాన అర్చక స్వాములు, స్వామి అమ్మ వార్ల విశిష్టత వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# నర్సరీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనుమతుల్లేని నర్సరీలను రద్దు చేయాలని, నాసిరకం నారు అమ్ముతున్న నర్సరీ యజమానులుపై కఠిన చర్యలు చేపట్టాలని, ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మదనపల్లె ప్రెస్ క్లబ్ నందు ఎపి కౌలురైతుల సంఘం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నష్టపోయిన కౌలురైతులతో ఏర్పాటు చేసిన విలేకరల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 వేల నుంచి 30 వేల ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారని, వీరంతా చిన్న, సన్నకారు కౌలు రైతులే ఉన్నారన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని నర్సరీ యజమానులు నాసిరకం నారుని అంటగట్టి రూ.కోట్లు సంపాదిస్తుంటే రైతుల మాత్రం పీకల్లో అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ లో విచ్చలవిడిగా నాసిరకం విత్తనాలు అమ్ముతున్న కంపెనీలపైన, నాసిరకం నారు పెంచుతున్న నర్సరీ యజమానలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లాలో బొప్పాయి సాగు జీవనాధారం గా చేసుకుని దాదాపు 5 నుంచి 10 వేల ఎకరాల వరకు బొప్పాయి సాగు చేస్తున్నారన్నారు. గత ఎనిమిది నెలల క్రితం కలికిరిలో ఎల్లారెడ్డి నర్సరీ, రాజన్న నర్సరీ, మదనపల్లెలో శేఖర్‌రెడ్డి నర్సరీల నుంచి బొప్పాయి నారును మొక్క ఒకటి రూ.12 వేల చొప్పున కొనుగోలు చేసి పొలాల్లో నాటారన్నారు. పూత, పిందె ఉన్నప్పటికి కాయ సైజు పెరగ కపోవడం, చెట్టుకు కాయ నిలబడకుండా రాలిపోవడం జరుగుతుందన్నారు. నర్సరీ యజమానులు కల్తీ, నాసిరకం నారును అమ్ముతూ స్వైర విహారం చేస్తుంటే ఆధికారులు మొద్దు నిదర పోతున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పిఎల్ నరసింహులు, బొప్పాయి రైతు సంఘం నాయకులు కె.రామకృష్ణ, కె.గంగిరెడ్డి, బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

# బిటి కళాశాల సిబ్బంది సమస్యను పరిష్కరించిన లోకేష్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లి

శత సంవత్సరాల చరిత్ర కలిగిన బిటి కళాశాలలో మూడేళ్లగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యను అరగంటలో పరిష్కారం చేసిన ఘనత విద్యా శాఖా నారా లోకేష్‌కే దక్కిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక బెంగుళూరు బస్టాండ్‌లో టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి జాతీయ గీతం అందించిన కళాశాల అని గుర్తు చేశారు. గతంలో డిగ్రీ చదవాలంటే కేవలం హైదరాబాద్, కాకినాడ, బెంగుళూరుల్లో మాత్రమే అవకాశం ఉండేదన్నారు. బిటి కళాశాల ఆస్తులను కాజేయడానికి గత ప్రభుత్వం కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటుందని చెప్పి, సిబ్బంది సమస్యను అపరిష్కృతంగా వదిలేశారని పేర్కొన్నారు. దీంతో వారికి జీతాలు అందక చాలా ఇబ్బందులు పడ్డారని వివరించారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల కళాశాల సిబ్బంది విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లో నేరుగా కలిసి సమస్యను విన్నవించడం జరిగిందని దీంతో వెంటనే స్పందించిన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీకి చెప్పి అరగంటలో సమస్యను పరిష్కారం చేయడం అయన పరిణీతికి, బాధ్యతకు నిదర్శనమని కొనియాడారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రవీంద్రనాథ్ ఠాగూర్ శత జయంతి ఉత్సవాలకు అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా ఆహ్వానించి కళాశాల ఆస్తుల పరిరక్షణ కోసం రూ.2.5 కోట్లతో ప్రహరీ గోడలు నిర్మించడం జరిగిందన్నారు. కళాశాల అభివృద్ధికి రూ.6.5 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ కళాశాలను అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తుకు ఉపయోగ పడేలా యూనివర్సిటీ స్థాయికి అభివృద్ధి చేయటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల్లోపే బిటి కళాశాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కళాశాలను ఆస్తులను సిబ్బందిని అందరిని ప్రభుత్వం గుర్తించి జిఒ విడుదల చేయడమైనదని పేర్కొన్నారు. మిగిలిన ఆరుగురు సిబ్బంది విషయంలోనూ న్యాయం జరిగే విధంగా అండగా ఉంటామని తెలిపారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాటకొండ గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ బిటి కళాశాలలో మూడు సంవత్సరాలుగా జీతాలు రాక ఇబ్బంది పడ్డ సిబ్బంది ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్‌ను కలుసుకోగానే ఎమ్మెల్యేకి విషయం చెప్పి వివరాలు తెలుసుకొని వెంటనే వారికి జీతాలు అందే విధంగా ప్రభుత్వంలో చేర్చుకుంటూ జిఒ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఎంతోమంది ప్రముఖులు, మాజీ ముఖ్యమంత్రులు బిటి కళాశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి ఏదిగారన్నారు. బిటి కళాశాల సిబ్బందికి టిడిపి ప్రభుత్వం ఏర్పడగానే న్యాయం జరిగిందని దీనిపై వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిత్రపటాలకు పాలాభిషేకం చేయటం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు నాదెళ్ల శివ, నాగూర్ వలి, నవీన్ చౌదరి, యర్రబల్లి వెంకట రమణరెడ్డి, ఇంతియాజ్, డాన్స్ రెడ్డెన్న, జీవి నాయుడు, సంఘం బ్రదర్స్, అన్వర్ బాషా, వేమయ్యతో పాటు బిటి కళాశాల సిబ్బంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో శివ

## ఇంటికి చేరిన కువైట్ బాధితుడు శివ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

బతుకుదెరవు కోసం కువైట్‌కు వెళ్లిన బాధితుడు.. అక్కడ ఎడారిలో ఎవ్వరూ లేక పడరాని పాట్లు పడి నరకయాతన అనుభవించి.. చివరకు ఇళ్ల చేరిన సంఘటన వాల్మీకిపురం మండలం చింతపర్తిలో చోటు చేసుకొంది.. మండలంలోని చింతపర్తికి చెందిన శివ నెలక్రితం బ్రతుకు దెవరకు కోసం కుటుంబ సభ్యులను వదిలి కువైట్‌కు వెళ్లాడు. అక్కడ ఎవ్వరూ లేని ఎడారిలో గొర్రెలు, బాతులు, పావురాలు, కుక్కలకు కాపలాగా పెట్టారు. తిండి, నీళ్ల లేక చావే శరణ్యమని సోషల్ మీడియాలో వీడియో పోస్టు పెట్టాడు. దీనిపై స్పందించిన డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కల్యాన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కువైట్ ఎంబసి అధికారులు, తదితరులతో చర్చించి, బాధితుడు శివను ఇండియాకు రప్పించేందుకు చర్యలు చేపట్టారు. బాధితుడు శివకు విముక్తి లభించింది. బుధవారం మధ్యాహ్నం బాధితుడు శివ సొంత గ్రామమైన వాల్మీకిపురం మండలం చింతపర్తికి సురక్షితంగా చేరుకోవడంతో కుటుంబంలో సంతోషం నెలకొంది. శివను చూసిన భార్య, పిల్లలు ఆయన్ను హత్తుకొన్ని బోరున విలపించారు. ఎట్టకేళకు బాధితుడు శివ సొంత గ్రామానికి చేరుకోవడంతో బాధితుడి కుటుంబంతో పాటు చుట్టుప్రక్కల వారు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మీడియా ప్రతినిధులకు ఎంపీ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మీడియా ప్రతినిధులను అసభ్య పదజాలాలతో నోటికి వచ్చినట్లు తిట్టడం హేయమైన చర్య అని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న ఒక ప్రకటనలో ఖండించారు. పెద్దల సభలో సభ్యునిగా ఉంటూ నోటికి ఏది వస్తే అది మాట్లాడడం సిగ్గుచేటని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేసే మీడియాను దూషిస్తే వారికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. మీడియా ప్రతినిధులను దూషించిన విజయసాయిరెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే మీడియా ప్రతినిధులు చేసే పోరాటానికి పిడిఎస్‌యు మద్దతు ఉంటుందని తెలిపారు.

## హనుమంత వాహనంపై సౌమ్యనాథుడు

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు బుధవారం హనుమంత వాహనంపై ఆసీనులై శ్రీరామచంద్రుని అవతారంలో భక్తులకు కనువిందు కలిగించారు. ఈ గ్రామోత్సవం నందలూరు, పేటగడ్డ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా బస్టాండ్ కూడలి వరకు కొనసాగింది. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి సందర్భంగా సౌమ్యనాథ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా 6 వ రోజు ఉదయం శేషవాహనం, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రి గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

# డెంగీ, మలేరియా బారిన పడకుండా రక్షించండి

**- ప్రజా సంఘాలు, భారత న్యాయవాదుల సంఘం**



మాండవ్య నదిని పరిశీలిస్తున్న ప్రజాసంఘాలు, న్యాయవాదులు

ప్రజాశక్తి-రాయచోటి

మురుగు నీటి గుంటగా మారిన పట్టణంలోని మాండవ్య నదిని శుభ్రపరచి డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల నుంచి రాయచోటి ప్రజలను కాపాడాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక, భారత న్యాయవాదుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మురికి నీటితో నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిపోయిన మాండవ్య నదిని వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్ మాట్లాడుతూ మాండవ్యనది పరిశుభ్రతపై, మురుగునీటి కాలువల పైన గత ప్రభుత్వం దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల పట్టణంలోని మురుగునీరంతా నదిలోనికి వదిలి వేయడం వలన అది మురికి నీటి గుంటగా మారిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిపోయిందని అన్నారు. పట్టణమంతా కూడా దోమల వ్యాపించి ప్రజలు మలేరియా,డెంగీ బారిన పడుతున్నారని తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైన దీనిపై శ్రద్ధ వహించి రాయచోటి పట్టణ పడమర వైపు నుంచి చల్లంపల్లి వరకు సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున ఉన్న మురుగు నీటి గుంటలను, కంప చెట్లను తొలగించి నదికి ఇరువైపులా ఉన్న మురికి నీటి కాలువల కు మరమ్మతులు చేపట్టి మురికి నీటిని దూరంగా వదిలేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం న్యాయవాది పి. రెడ్డయ్య మాట్లాడుతూ 30 వేల కుటుంబాల వరకు నివాసం ఉన్న రాయచోటి పట్టణ మధ్యలో మాండవ్య నది పోతూ ఉండటం వలన పట్టణములోని మురికి నీరు నదిలో వెళ్లకుండా గతంలో నదికి ఇరువైపులా పెద్ద కాలువలు ఏర్పాటు చేసినప్పటికీ గత ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా పట్టించుకోకపోవడం వలన కాలువలు పూడిపోయాయని, కాలువల్లో రాయచోటికి దూరంగా వెళ్లాల్సిన మురికి నీరు అంతా కూడా మాండవ్య నదిలోనికి వెళ్లి నది అంతా కూడా మురుగు నీటి చెరువుల్లాగా తయారైపోయాయని అన్నారు. నది ఇరువైపులా ఉన్న కాలువలను తక్షణం మరమ్మతులు చేపట్టి దోమల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, న్యాయవాదులు ధనుంజయ్ కుమార్, ఆనంద్ కుమార్, చిన్నయ్య, రవిశంకర్, వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి మారుతి శంకర్, రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు, శ్రీనివాసులు, విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షులు చెల్లారెడ్డయ్య, స్థానికులు పాల్గొన్నారు.



కలకడలో ఊరేగుతున్న బంగారు పీర్లు

## మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

**ప్రజాశక్తి- కలకడ**

మండలంలోని కలకడ, దేవళంపేట, అగ్రహారం, ఎర్రకోటపల్లి, పాం రెడ్డిగారిపల్లి, నడిమిచెర్ల, కోన తదితర గ్రామాలలో పేర్లను నెలకొల్పి పండుగను జరుపుకున్నారు. శాంతి యుత సమాజ స్థాపన కోసం ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణ త్యాగం మానవాళికి దివ్య సందేశమే ఈ మొహర్రం పండుగ ముఖ్య ఉద్దే శమని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని హిందూ-ముస్లింలు ఐకమ త్యంగా పండుగను నిర్వహించుకున్నారు. అనంతరం గ్రామాల్లో పీర్లను ఊరే గించి జల్దిలో కలిపి మొహరం శుభాకాంక్షలు తెలుపుకొని పండుగను ముగించారు. **సుండుపల్లి:** మండలం మడితాడులో హిందూ-ముస్లిములు కలిసి మొహర్రం పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మానవజాతి ఇస్లాం కొరకు చేసిన గొప్ప త్యాగానికి అనిర్వచనీయ సహనానికి మొహరం ప్రతికగా మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని స్మరించుకొని కులమత బేధాలు లేకుండా పీర్ల పండుగను జరుపుకున్నారు. షేక్ మొహమ్మద్ హనీఫ్ వారి కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా ముజావర్ కుటుంబంలో ఉండే షేక్ షాజహాన్, షేక్ ఫయాజ్ మనవడు వారి కుటుంబం తరతరాలుగా గ్రామంలోని హిందూ ముస్లిం సోదరులను అందరినీ కలుపుకొని పీర్లు ఊరేగిస్తూ ఈ పండుగను జరుపుకుంటున్నా మని పేర్కొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని టి.కమ్మపల్లి పంచాయతీలోని టి.బలిజిపల్లె గ్రామస్తులు మోడం ఈశ్వరయ్య కృష్ణంపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు బుధవారం ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మతలకు అతీతంగా మొహర్రం వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. మొహరం వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలిరావడం జరిగింది. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కాపర్ల చంద్రశేఖర్ నాయుడు, జనసేన నాయకులు పసుపులేటి వెంకటరమణ, మోడం ఈశ్వరయ్య, ప్రేమ్‌కుమార్, శివాజీ, కొండేటి చంగయ్య, కుప్పాల మల్లికార్జున, కంబాల సురేష్, చంద్రమోహన్, సుబ్బయ్య కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు :** పీలేరులో భక్తిశ్రద్ధలతో ముహర్రమ్-ఉల్-హరామ్ వేడుకను జరుపుకున్నారు. ఇది ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం యుద్ధ మైదానంలో హసన్, హుస్సేన్ జరిపిన పవిత్ర పోరాటంలో వారు వీరమరణం పొందడాన్ని గుర్తు చేసుకుంటూ ఈ మొహర్రం ఆచరిస్తారు. పవిత్ర ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభం రోజున పీర్ల చావడుల్లో పీర్లను ప్రతిష్టించి పది రోజుల పాటు ముహర్రమ్ విషాద దినాలను ఆచరిస్తారు. చివరి రోజు పీర్లను ఊరేగించి జల్దీకి తరలిస్తారు. అదేవిధంగా పీలేరు పట్టణంలోనూ ముహర్రమ్-ఉల్-హరామ్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో పీలేరు పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన హిందూ, ముస్లిములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మోహన్‌బాబు యూనివర్సిటీ నుంచి 'పసుపులేటి'కి ఆహ్వానం

**ప్రజాశక్తి-నందలూరు**

తిరుపతి సమీపంలోని ప్రముఖ సినీనటులు, నిర్మాత డాక్టర్ మోహన్‌బాబుకు చెందిన యూనివర్సిటీ నుంచి రాజంపేట సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌కు ఆహ్వానం అందింది. తమ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు ఈనెల 25న వ్యక్తిత్వ వికాసం, వృత్తి మాం దర్శకాల గురించి ఉపన్యాసించమని కోరుతూ విశ్వవిద్యాలయ డీన్ ఫ్రెష్ మెన్ ఎన్.గిరీష్ నుంచి ఆహ్వానం అందినట్లు శివ శంకర్ తెలిపారు.

## కార్యకర్తల సంక్షేమానికి కృషి చేయండి

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడానికి కృషి చేసిన టిడిపి, జనసేన కూటమి కార్యకర్తలకు ప్రభుత్వం అండగా నిలిచి వారి సంక్షేమానికి కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బాలశెట్టి హరిప్రసాద్ ఆకాంక్షించారు. కడప టిడిపి కార్యాలయంలో అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం మండల జనసేన అధ్యక్షులు నిమ్మనపల్లి పవన్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా మీడియా ఇన్‌ఛార్జి కె.వెంకటేశ్వర్లు, మండల పరిచార కార్యదర్శి యనుముల విశ్వనాథ్, సైనాతం శివయ్య కలిసి హరిప్రసాద్‌ను సత్కరించారు.

## బాలుర బిసి గురుకుల పాఠశాలను నిర్మించండి

**ప్రజాశక్తి-నందలూరు**



మంత్రి సవితకు వినతి పత్రం అందిస్తున్న వేణుగోపాల్

మండలంలో బిసి బాలుర గురుకుల పాఠశాలను నిర్మించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను కోరారు. బుధవారం టిడిపి జాతీయ కార్యాల యంలో బిసి సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బిసి విద్యార్థులు ఉన్నారని వారికి అనుగుణంగా నందలూరు మండలంలో బిసి గురు కుల పాఠశాలను నిర్మించాలని కోరినట్లు తెలిపారు. నందలూరులో అన్ని వసతులు, ప్రభుత్వస్థలం, మంచి వాతావరణం, స్వచ్ఛమైన నీరు అన్నిటికీ అణువుగా ఉంటు ందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :** పట్టణ పరిధిలోని మన్నూరులో గల శ్రీగోదామహాలక్ష్మి సమేత ఐరావత ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వమించారు. ముందుగా స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, చక్కగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మన్నూరు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమిష్టిగా ఆలయ అభివృద్ధికి కృషి : 'చమర్తి'

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :** సమిష్టి కృషితో ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని అత్తిరాల గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ కామాక్షి త్రేతేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అర్చకులు ఆలయ విశిష్టత వివరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. అంతకుముందు స్వామివారి దర్శనార్థం విచ్చేసిన చమర్తి జగన్ మోహన్ రాజును ఆలయ మాజీ చైర్మన్ పూల నరసింహులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు పూల నరసింహులు, శంకర్‌రాజు, పార్ల మెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ కుమార్‌రాజు, జివి.సుబ్బరాజు, శేషారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, సూర్యనారాయణ రాజు, ఆలయ మాజీ డైరెక్టర్లు కడప రాంప్రసాద్, తాళ్లపాక సుబ్బరాయుడు, పూల బాలాజీ, చిన్నబాబు పాల్గొన్నారు.



తొలి ఏకాదశి వేడుకల్లో చమర్తి జగన్‌మోహన్‌రాజు

# నిరంతరం ప్రజలతోనే ప్రయాణం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

నియోజకవర్గం ప్రజలతో నిరంతరం తన ప్రయాణం కొనసాగుతుందని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం తాను తంబళ్లపల్లిలో వైసిపి కార్యాలయానికి వెళితే టిడిపి శ్రేణులు నానాయాగి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని, తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. టిడిపి నాయకులు బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి నియోజకవర్గం ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిం చారని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి శాయశక్తుల పని చేస్తానని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన నెలలోనే టిడిపి శ్రేణుల ఆగ డాలు మితిమీరిపోయాయని, నియోజకవర్గంలో అలజడులను సృష్టిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదనే విషయాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు గుర్తించుకోవాలని పేర్కొన్నారు.

# గాలివీడులో టమోటా కిలో రూ.120



సంతలో కూరగాయలు కొంటున్న ప్రజలు

**ప్రజాశక్తి-గాలివీడు**

ప్రతి బుధవారం గాలివీడు బస్టాండ్ వెనుక కూరగాయల సంత జరుగుతుంది. గుర్రంకొండ, పెద్ద మండెం, కల్చర్ల, రాయచోటి, గాండ్లపెంట, కదిరి, చుట్టుపక్క మండలాల నుంచి వ్యాపారం చేసుకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. మండలంలోని 17 గ్రామాల్లో ఉన్న రైతులు పండించిన కూరగాయలు తీసుకొని సంతకి వస్తారు. సంతలో ప్రతి ఒక్కరూ వ్యాపారం చేసుకోవడం అలవాటు పడి మార్కెట్ నిర్ణయించిన ధరకంటే అధిక ధరకు కూరగాయలు విక్రయిస్తున్నారు. బుధవారం జరిగిన కూరగాయల సంతలో పచ్చిమిర్చి కిలోరూ.120, టమోటా రూ.120, అలసంద రూ.100, అనపకాయలు రూ.100, మునగకాయలు రూ.150, క్యారెట్ రూ.100, బీన్స్ రూ.100, చిక్కుడు రూ.80లు, కాకర, బెండ రూ.80లకు అమ్ము తున్నారు. సంతలో కాలుపెడితే జేబులో ఉన్న డబ్బులు ఖాళీ అవ్వాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. ఇటువంటి రేట్లతో ఏమి కొని తినలేకున్నామని పేద, మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు. సంతలో మార్కెట్ ధరకే విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలకు అందు బాటులో ఉండే విధంగా కూరగాయల ధరలు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

# పిండ మార్పిడిలో ఒంగోలు జాతి కోడెదూడ జననం

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**



జెర్సీ ఆవుకు జన్మించిన ఒంగోలు జాతి కోడే దూడతో డాక్టర్ ప్రతాప్, లబ్ధిదారు లక్ష్మీదేవి

పిండ మార్పిడి విధానాల్లో ఒంగోలు జాతి కోడెదూడ జన్మిం చిందని శెట్టిగుంట పశు వైద్యులు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా పిండ మార్పిడి విధానాన్ని నిర్వహి స్తున్నాయని అన్నారు. రైల్వే కోడూరు మండలం శెట్టిగుంట పశువైద్యశాలకు చెందిన జ్యోతి కాలనీ గ్రామంలో కుళాయి లక్ష్మీదేవి అనే రైతుకు చెందిన జెర్సీ ఆవుకు పిండ మార్పిడి విధానం ద్వారా ఒంగోలు జాతి పిండాన్ని 2023 వ సంవత్సరం సెప్టెంబర్ నెల 29వ తేదీన ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. ఈ పశువు చూలు నిర్ధారణ 2023 వ సంవత్సరం డిసెంబర్ 27వ తేదీ జరిగిందని తెలిపారు. అత్యంత ఉత్తమ జన్యులక్షణాలు కలిగినటువంటి ఒంగోలు జాతి కోడెదూడ ఈనెల 16న రాత్రి 10:30 కి జన్మించడం జరిగిం దని తెలిపారు. పిండ మార్పిడి విధానంలో ముఖ్య భూమిక పోషించి నటు వంటి రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సిఇఒ డాక్టర్ శ్రీనివాసరావుకు, గుంటూరు లామ్ ఫామ్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావుకు, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ అదనపు సిఇఒ డాక్టర్ రజనీకుమారికి, ఒంగోలు జాతి పిండాన్ని ల్యాబ్‌లో తయారు చేసే విధానంలో పాత్ర పోషించినటువంటి డాక్టర్ శ్రీమన్నారాయణకు, డాక్టర్ శ్రీకాంత్‌కు, కడప జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఇఒ డాక్టర్ రమేష్, విఎఎస్ డాక్టర్ శివరామిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పిండ మార్పిడి విధానం ద్వారా అంతరించిపోయే దగ్గర్లో ఉండే పశువుల్ని కాపాడుకోవడానికి ఉత్తమ జన్య లక్షణాలు కలిగిన టువంటి పశువులను త్వరితగతిన అభివృద్ధి చేయడానికి ఉపయోగ పడుతుందని తెలిపారు.

# ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ కొనసాగించాలి



మాట్లాడుతున్న శివప్రసాద్

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఎస్‌సి, ఎస్‌టిల గృహాలకు 200 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్ అందించే పథకం ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉందని, ఈ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక బాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ అంబేద్కర్ సేన 2013లో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష పట్ల అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ సానుకూలంగా స్పందించి ఎస్‌సి, ఎస్‌టి గృహాలకు ఉచితంగా విద్యుత్ అందించే ఈ పథకం అమలులోకి తెచ్చారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులతో నెలకు 50 యూనిట్ల దాకా విద్యుత్ ఉచితంగా అందించే విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదట ఈ పథకం ప్రారంభమైందని అన్నారు. తర్వాత 100 యూనిట్లకు, ఆతర్వాత 200 యూనిట్లకు పెంచారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా రెండు రాష్ట్రాల్లోనూ ఈ పథకం అమలులో ఉందని చెప్పారు. ప్రభుత్వం మారగానే కొత్త నిబంధనల పేరుతో ఆంధ్రప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ శాఖ అధికారులు ఉచిత గృహ విద్యుత్ పథకంలో లబ్ధిదారులుగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టిలకు కూడా విద్యుత్ బిల్లులు చేతిలో పెట్టి విద్యుత్ చార్జీలు కట్టాల్సిందేనని వేధింపులకు గురి చేయడం సరి కాదన్నారు. ఉచిత గృహ విద్యుత్ పథకంపై ప్రభుత్వం ఇప్పటివరకూ కొత్త మార్గదర్శకాలేమీ ఇవ్వక పోయినా, కొన్నిచోట్ల విద్యుత్ శాఖ అధికారులు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలను మళ్ళీ చీకటి వైపుకు నెట్టే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఉచిత విద్యుత్ పథకం అమలులో అధికారులు అవలంబిస్తున్న చర్యలపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, ఈ పథకం యథావిధిగా కొనసాగించేందుకు తగు చర్యలు తీసుకోవాలనికోరారు. ఈసమావేశంలో బాస్ నాయకులు రెడ్డెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# గంబూషియా చేపలతో దోమల నివారణ

**ప్రజాశక్తి-కలకడ**



గంబూషియా చేపలను కుంటలో వదులుతున్న వైద్య సిబ్బంది

గంబూషియా చేపలతో దోమలను నివారించవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ ముజీబ్‌బాషా తెలిపారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లి గ్రామం కదిరాయచెరువు వద్ద ఉన్న ఊటచెలిమి బావిలోను, గ్రామ పంచాయతీ, లోను వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గంబూషియా చేపపిల్లలను వదిలినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిలో దోమల లార్వా పెరగకుండా గంబూషియా చేపలు తినే దోమల నివారణకు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. అనంతరం ఎంపిహెచ్ఇఒ జి.జయ రామ య్య మాట్లా డుతూ జిల్లా మలేరియా అధికారి సూచనలతో గంబూషియా చేప పిల్లలను చెరువుల్లోకి వదిలినట్లు ఆయన తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో డెంగీ, జ్వరాలు వచ్చిన విషయం గుర్తు పెట్టుకోవాలని, వ్యక్తి గత పరిశుభ్రత, పరిస రాల పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమలు వృద్ధి నివారించడానికి సిద్ధం గా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ విజర్స్ యం. వెంకటేశ్వరరావు, షైక్ షీరఫ్‌బాషా, జామిల్‌అహమద్, ఆరోగ్య కార్య కర్త వాణి, గురుశాంత. జె.రమణమ్మ పాల్గొన్నారు.

# కారంచేడు స్ఫూర్తితో అస్తిత్వ ఉద్యమాలు



కారంచేడు వీరులకు నివాళి అరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-పీలేరు**

అస్తిత్వ ఉద్యమాలకు కారంచేడు ఉద్యమమే స్ఫూర్తిదాయకమని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. కారంచేడు అమరవీరుల 39వ సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమరవీరులను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్ మాట్లాడుతూ 1985 జూలై 17న కారంచేడులో అహంకారం నిండిన భూస్వాములు దళితులను ముక్క లుగా నరికి దళితవాడను నెత్తుటి కుప్ప చేసిన ఘటనకు 39 ఏళ్లు నిండాయన్నారు. ఓ దళిత మహిళ ఎదిరించడాన్ని జీర్ణించుకోలేని అధికారంతో మదమెక్కిన ఆ గ్రామ భూస్వాములు దళితుల గుడిసెల మీద పడి ఎందరో స్త్రీల మీద లైంగిక, భౌతిక దాడులు చేసి, కత్తులు, బరిసెలతో వీరంగం సృష్టిస్తూ అగ్రకుల రాక్షస మూకలు దళితులను హత్య చేసి నెత్తుటి ఏరులు పారించారన్నారు. ఆ దుర్ఘటన కారంచేడు లోని మాదిగలను, మాలలను, ఎరుకలను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. వీరంతా కలిసి ఆ రాక్షస మూకల నుంచి బాధితులను కాపాడుకునే ప్రయత్నం చేసి జరగబోయే మరింత నష్టాన్ని నిలువరించారని అన్నారు. ఎన్నో తరాల నుండి వివక్షను, అణచివేతను పంటిన బిగబట్టి ఉన్న దళితులు కారంచేడు ఊచకోత దారుణాన్ని సహించలేక ఒక్కసారిగా ఉద్యమానికి పూనుకున్నారని తెలిపారు. కారంచేడు నెత్తుటి దారిలో మొదలైన ఆ దళిత ఉద్యమం రాష్ట్రమంతా విస్తరించిందని, ఈ ఘటన తర్వాతే ఎంతోమంది దళితులు తమ ఆస్తిత్వం, హక్కులు, ఆత్మరక్షణ కోసం పిడికిళ్ళు బిగించారని అన్నారు. కారంచేడు దారుణకాండకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా దళితుల్లో, ప్రజాస్వామ్య శక్తుల్లో గొప్ప చైతన్యాన్ని కలిగించిందని, ఈ ఉద్యమం దళిత పోరాట చైతన్యానికి ప్రతీకగా మారిందని పేర్కొన్నారు. కారంచేడు ఉద్యమం జాతీయస్థాయి ఉద్యమానికి నాంది పలికి ఎస్‌సి, ఎస్‌టి, అత్యాచార నిర్మూలన చట్టం తెచ్చిందని వీరు తెలిపారు. అగ్రకుల మనువాద పాలకుల పాలనలో కోల్పో తున్న హక్కుల కోసం కారంచేడు అమరుల ఉద్యమ స్ఫూర్తితో దళితులు ఆత్మ గౌరవ ప్రతిఘటన పోరాటాలను నిర్మించాలని వారు కోరారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి కృష్ణయ్య, ఎర్రబల్లి మల్లికార్జున, పల్లె పోగు హరినాధ, ముల్లంగి గురవయ్య, నాగేశ్వరరావు, మాలమహానాడు నాయకులు గుండ్లూరి రవీంద్ర, దప్పేపల్లి ఆనంద, నాగేంద్ర, సురేంద్ర, ద్వారక, పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో దాతలతో లయన్స్ క్లబ్ సభ్యులు

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి-రామాపురం**

దానాలలో అన్నదానం చేయడం గొప్పదని వీరాంజనేయులు మల్లి కార్జున పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో బుధవారం గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ నక్క లవాండ్లపల్లికు చెందిన సుద్దమల్ల వీరాంజనేయులు, మల్లికార్జున తమ తల్లి పారతమ్మ మూడో వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ తల్లి లాంటి వృద్ధులకు అన్నదానం చేసే అవకాశం రాయచోటి లయన్స్ క్లబ్ శివారెడ్డి, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ మహమ్మద్ కల్పిం చారని అన్నారు. ఇకపై తమ కుటుంబంలో ఎలాంటి వేడుకలు జరుపుకున్న సమాజానికి ఉపయోగపడేలా కార్య క్రమం నిర్వహించుకుంటామని తెలిఆపరు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మహమ్మద్, శివారెడ్డి, చాంద్ బాషా , రామ్మోహన్, ప్రేమాలయం సిబ్బంది పారుతమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఉద్యోగం కోసం అర్హత పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

## జాబ్‌మేళాలో 12 మందికి ఉద్యోగాలు

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

శ్రీ సాయి డిగ్రీ కాలేజ్‌లో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 24/7 ఏఐ అనే ఇంటర్నేషనల్ కంపెనీ ద్వారా నిర్వహించిన జాబ్ మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో మొదటి,రెండవ రౌండ్ పూర్తి చేసుకొని మూడవ రౌండ్‌కు 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. చివరి రౌండ్‌లో 12 మంది ఎంపిక అయ్యారని, ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందించినట్లు కళాశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ముత్యాల పెంచలయ్య మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ చిత్తూరు కడప ఉమ్మడి జిల్లా ప్లేస్మెంట్ అధికారి వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీని వాసులు, ఫౌండేషన్ సభ్యులు గురుసాయి, సుబ్రహ్మణ్యం, సాయి కృష్ణ, కళాశాల అధ్యాపకులు ఎస్.ఉపేంద్ర, కళాశాల ప్లేస్మెంట్ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

## మొక్కలకు కంచె ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్**



మాట్లాడుతున్న తిరుపతిరావు

పట్టణంలో నాటిన మొక్కల పరిరక్షణకై మునిసిపల్ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి మొక్కకు ట్రీ గార్డ్ ఏర్పాటు చేయాలని మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం అయన మాట్లా డుతూ మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ బాషా చేపట్టిన చెట్ల పెంపకం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల పరిరక్షణకై అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పేదల ఊటీగా పేరుగాంచిన మదనపల్లె పట్టణంలో గత కొన్ని ఏళ్లుగా విచ్చలవిడిగా చెట్లు నరికి వేయడంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం వేసవికాలంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడంతో ప్రజలు ఎండ తీవ్రతను భరించలేక తీవ్రమైన ఉక్కపోతకు గురయ్యారని అన్నారు. ఎమ్మెల్యే పచ్చదనం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పట్టణంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 5వేల మొక్కలు నాటే మహాయజ్ఞాన్ని చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. ట్రీగార్డులు ఏర్పాటు చేసి, నాటిన మొక్క ఎదిగే వరకు ప్రతిరోజు నీరు పోసి, మొక్కలు ఎండిపోకుండా, పశువులు, గొర్రెలు తినకుండా సంరక్షణ బాధ్యతలు చేపట్టి పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని కోరారు.



పింఛా ప్రాజెక్టును పరిశీలిస్తున్న బాలసుబ్రమణ్యం

## పింఛా ప్రాజెక్టు పనులు పరిశీలించిన 'సుగవాసి'

**ప్రజాశక్తి-సుండుపల్లి**

సుండుపల్లె మండలం బుడంపాడు గ్రామపంచాయతీలో ఉన్న పింఛా ప్రాజెక్టును పనులను బుధవారం నియోజకవర్గ టిడిపి నాయకులు సుగ వాసి బాలసుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛా ప్రాజెక్టు అభివృద్ధి పనులకు తన వంతు కృషి చేస్తానని ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు భూములను వ్యవసాయం చేసుకునే విధంగా తిరిగి ప్రాజెక్టులోకి నీరు అందుబాటులో ఉండేట్టుగా చూస్తామని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ చేసి జరగవలసిన పనుల గురించి చర్చించినట్లు తెలిపారు. మిగతా పనులకు అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా ప్రాజెక్టు నిర్మాణంలో పురోగతి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌పి

అన్నమయ్య జిల్లా నూతన జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన విద్యా సాగర్ నాయుడు బుధవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జిల్లా ప్రజలు ఉండే విధంగా పోలీసు యంత్రాంగం పనిచే యాలని సూచించారు. మన జిల్లాకు మంచి పేరు వచ్చేలా లా అండ్ ఆర్డర్‌ను గాడిలో పెట్టాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.